క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహా సౌరయాగం



నెల్లూరు(బృందావనం): భాను సప్తమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో మహా సౌరయాగాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. యాగాన్ని కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌ప్రభు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

శాలివాహన విద్యార్థులకు పురస్కారాలు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: కొత్తూరు సమీపంలోని శాలివాహన సంక్షేమ భవనంలో కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలివాహన సంక్షేమ భవన పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి మధుసూదన్‌రావు మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్‌లో 75 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 83329 11297 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కమిటీ కార్యదర్శి పెళ్లూరు సుమన్ ప్రజాపతి, కోశాధికారి ఐనకోట రఘురామయ్య, కార్యవర్గ సభ్యులు ఈదూరు మధు, గూడూరు వెంకటేశ్వర్లు, బెజవాడ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు లౌకికవాదులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా అంకయ్య పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం వారు మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జిల్లా స్థాయి సదస్సును మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నామని, భారీగా తరలిరావాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు బసవరాజు, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, సిరాజ్, మస్తాన్‌బీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని నెహ్రూ యువ కేంద్రం, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి కెరెంటాఫీస్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, డీఎస్డీఓ యతిరాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముత్తుకూరు రోడ్డులోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గోపీనాథ్ మాట్లాడారు. 226 మంది క్రీడాకారులు రిజిస్టర్ చేసుకోగా, వీరిలో 65 మంది ఇంటర్నేషనల్ రేటింగ్ క్రీడాకారులని తెలిపారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్, సిల్వర్ ఓక్స్ స్కూల్ డైరెక్టర్లు వెంకటాద్రినాయుడు, షణ్ముఖాచారి, ప్రిన్సిపల్ సుధాకర్, ఇన్‌చార్జి ప్రవీణ్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ గోపీనాథ్, కోచ్ మధుసూదన్‌రెడ్డి, ఆర్బిటర్లు హుస్సేన్, ప్రదీప్, వెంకటరమణ, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్.. బిల్లుల్లో తేడాలు

- పొదలకూరు మండలంలో 23 మంది వినియోగదారులు
- సబ్సిడీపై సోలార్ సిస్టమ్ ఏర్పాటు
- బిల్లుల్లో వ్యత్యాసంపై అసంతృప్తి
- జమకాని రాయితీ



సోలార్ విద్యుత్ మీటర్



సోలార్ ప్యానెల్



వినియోగదారుడికి తేడాగా వచ్చిన విద్యుత్ బిల్లు

పొదలకూరు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను ప్రకటించాయి. దీనిపై సభలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే ఈ పథకంలో భాగంగా సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకున్న కొందరు వినియోగదారులకు బిల్లుల్లో తేడాలు వచ్చాయని చెబుతున్నారు. ఆదా అవుతున్న బిల్లుల్లో చూపుతున్న విద్యుత్‌కు తేడాలు ఉన్నాయని, దీనిని నివృత్తి చేయడంలో అధికారులు చొరవ చూపడం లేదంటున్నారు. దీనికితోడు బ్యాంక్ ద్వారా రుణం పొంది సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్న వినియోగదారులకు మూడు నెలలు గడిచినా రాయితీ జమకాలేదంటున్నారు. పథకం అమలులో బాలారిష్టాలు ఉన్నందున విద్యుత్ అధికారులు చొరవ తీసుకుంటే సోలార్ వినియోగం పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇదీ వ్యవహారం..

పొదలకూరు మండలంలో గతేడాది డిసెంబర్ నుంచి 23 మంది వినియోగదారులు సబ్సిడీపై సూర్యఘర్ సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 3 కిలోవాట్లది 10 మంది, 6 కిలోవాట్లది ముగ్గురు, 3.4 కిలోవాట్లది ఒకరు, 3.28 కిలోవాట్లది ఒకరు, 3.4 కిలోవాట్లది ఒకరు, 3.3 కిలోవాట్లది ఒకరు, 3.26 కిలోవాట్లది ఒకరు, 5 కిలోవాట్లది ముగ్గురు, నాలుగు కిలోవాట్లది ఇద్దరు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వీరిలో కొందరికి సోలార్ మీటర్లో చూపిన విద్యుత్ యూనిట్లకు, బిల్లుల్లో వచ్చిన యూనిట్లకు తేడా ఉన్నట్టు తెలిసింది. సోలార్ మిగులు విద్యుత్‌ను ఆ శాఖ కొనుగోలు చేస్తుంది. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఆటోమేటిక్‌గా విద్యుత్ లైన్‌లోకి వెళ్లేలా సిస్టమ్‌ను అమర్చడం జరుగుతుంది. అయితే వినియోగదారులకు మార్చినెలలో అందజేసిన బిల్లుల్లో తేడా చూపుతున్నట్టు తెలిపారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు.

వినియోగం తగ్గించవచ్చు

ఈ పథకంలో గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతితక్కువ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటి పైన కనీసం 10 చదరపు అడుగుల స్థలంలో ఒక కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుంది. రూఫ్‌టాప్ ఏర్పాటులో భాగంగా 1 కిలోవాట్‌తో 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది కాబట్టి సాధారణంగా రూ.వెయ్యి బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.338 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. 2 కిలోవాట్లతో 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని కాబట్టి సాధారణంగా రూ.2 వేలు బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.333 మాత్రమే వస్తుంది. ప్రభుత్వం రూ.60 వేలు రాయితీని అందజేస్తుంది. 3 కిలోవాట్లతో 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది కాబట్టి సాధారణంగా రూ.3 వేలు బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.293 మాత్రమే వస్తుంది. సోలార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.78 వేల రాయితీని అందజేస్తుంది.

స్పష్టత ఇవ్వలేదు



పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా బ్యాంక్ రుణం రూ.2 లక్షలు పొంది రూ.10 వేలు వ్యక్తిగతంగా చెల్లించి సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకున్నాను. మార్చి నెల బిల్లు తేడాగా వచ్చింది. సోలార్ మీటర్లో 222 యూనిట్లు చూపుతుండగా బిల్లులో సోలార్ యూనిట్లు 88 మాత్రమే ఉంది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

– ఎస్.వేమారెడ్డి, వినియోగదారుడు, పొదలకూరు

బిల్లులను పరిశీలిస్తున్నాం



మండలంలో మొత్తం 23 సోలార్ సిస్టమ్స్‌ను అమర్చడం జరిగింది. ఎక్కడా తేడా చూపడం లేదు. పట్టణంలో మనుబోలు రోడ్డులో ఒక వినియోగదారుడి బిల్లు మాత్రం తేడా చూపినట్టు వెల్లడించారు. పరిశీలించి వివరించడం జరిగింది. ప్రతి ఆరునెలలకోసారి మిగులు సోలార్ విద్యుత్‌కు నగదు చెల్లించడం జరుగుతుంది.

– శ్రీకాంత్, విద్యుత్ ఏఈ, పొదలకూరు

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని విజయవాడ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ సిబ్బంది సత్కరించి.. శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్యామ్‌కు గిన్నిస్ రికార్డు



కోవూరు: మండలంలోని పడుగుపాడులో నివాసముంటున్న మేకనూరి శ్యామ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును దక్కించుకున్నారు. విజయవాడలో గతేడాది డిసెంబర్ ఒకటిన నిర్వహించిన అంతర్జాతీయ ఈవెంట్‌కు ఆయన హాజరయ్యారు. ఎనిమిది దేశాల నుంచి వచ్చిన 1046 మంది ఇందులో భాగస్వాములు కాగా, గంట పాటు కీ బోర్డును వాయించి వీడియోలను పోస్ట్ చేశారు. ఈ క్రమంలో గిన్నిస్ రికార్డుకు ప్రతినిధులు ఎంపిక చేశారు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మెడల్, సర్టిఫికెట్‌ను పాస్టర్ అగస్టీన్ దండంగి అందజేశారు.

దేవస్థాన చైర్మన్‌గా రాఘవేంద్రరావు



చైర్మన్‌ను అభినందిస్తున్న ఆర్యవైశ్యులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం చైర్మన్‌గా వాకాటి రాఘవేంద్ర రావు (ప్రసాద్) ఎన్నికైనట్టు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. రాఘవేంద్రరావుకు 269 ఓట్లు, ఆదూరు వెంకటసుబ్బయ్యకు 165 ఓట్లు లభించాయి. నూతన చైర్మన్‌ను పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు విరాళం



పొదలకూరు: స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఆదివారం చింతా రామకృష్ణారెడ్డి దంపతులు రూ.20 వేలు నగదును అందజేశారు. దేవస్థానం పరిసరాల్లో మొత్తం 16 కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందుకోసం రూ.1.60 లక్షలు వెచ్చించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి



వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది

- ఫైర్ ఆఫీసర్ విజయ వరకుమార్

పొదలకూరు: విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని పొదలకూరు ఫైర్ ఆఫీసర్ విజయ వరకుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం చైతన్య స్కూల్ విద్యార్థులు, కిసాన్ క్రాఫ్ట్ సిబ్బందికి డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిందిగా సూచించారు. ఎవరో చేసే తప్పునకు ఇతరులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు చేశారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నేడు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు, పున్నూరు, ముదివర్తిపాళెంలో గల సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను సోమవారం నిర్వహించనున్నామని ఎంపీడీఓ నాగేంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన కరిముల్లా ముత్తుకూరు మండలంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై వెళుతుండగా.. సర్వేపల్లి సమీపంలో ఎదురుగా ఆటో అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో కరిముల్లా గాయపడగా స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

మాజీ మంత్రి అనిల్‌కు సత్కారం



ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి ఆదివారం కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు.

సీతారాములకు వైభవంగా ఏకాంతసేవ



ప్రత్యేకాలంకరణలో సీతారాములు

మనుబోలు: మనుబోలు కోదండరామపురం సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాములకు ఏకాంతసేవను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అర్చకులు నూతన దంపతులైన సీతారాములకు అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. 9 రకాల పండ్లు, 9 రకాల స్వీట్లు స్వామి దంపతులకు నైవేద్యంగా ఉంచి శాస్త్రోక్తంగా ఏకాంతసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు సుబ్బారెడ్డి, ప్రసన్న దంపతులు వ్యవహరించారు.

ఘనంగా ఈస్టర్



కోవూరులో..



కొడవలూరు: చంద్రశేఖరపురంలో..

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలో గల రక్షణ సైన్య ప్రార్థన మందిరంలో ఈస్టర్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను సంఘ కాపరులు కృష్ణారావు, శైలజ ఆధ్వర్యంలో జరిపారు. అన్నదానాన్ని మధ్యాహ్నం నిర్వహించారు. సంఘ సభ్యుడు గంపా సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: పట్టణంలోని శారా బీలాక్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేకారాధనలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెవరెండ్ డాక్టర్ ప్రేమనాథ్ హాజరయ్యారు. వాక్యోపదేశాన్ని దావులూరి దివ్య అందించారు. అనంతరం చర్చి ఆవరణలో మొక్కలు నాటారు. పాస్టర్ రెవరెండ్ రాజేష్, చైర్మన్ కాకాణి రత్నసందరావు, వైస్ చైర్మన్ మైలా ఫ్రాన్సిస్, సెక్రటరీ తుమ్మలపెంట మోహన్, కోశాధికారి నావూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర కోసం వేచి చూస్తూ..



రిలయన్స్ రోడ్డులో భద్రపరిచిన ధాన్యం



పొట్టెంపాడులో పట్టలతో కప్పి ఉంచారిలా..

- కొనుగోలు కేంద్రాల వైపు చూడని రైతులు
- అక్కడ తక్కువ ఇస్తున్నారని చెబుతున్న వైనం

ముత్తుకూరు: మండలంలో పలు గ్రామాల రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడలేదు. కష్టించి పండించిన ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మకం చేస్తేనే గిట్టుబాటు ఉంటుందన్న ఆలోచనతో భారీగా ధాన్యం నిల్వ చేసుకున్నారు. పొట్టెంపాడు గ్రామంలో రబీ సీజన్ కింద రైతులు కేవలం బీపీటీలు మాత్రమే సాగు చేశారు. దిగుబడైన సుమారు 6 వేల పుట్ల ధాన్యాన్ని ప్రయివేటు గిడ్డంగుల్లో భద్రపరిచారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో పుట్టి ధాన్యాన్ని రూ.19,720లకు కొనుగోలు చేస్తోంది. ఈ ధరకు తృప్తి చెందని రైతులు రూ.20,000లకు కూడా అమ్మకాలు చేయడం లేదు. ఇదే బాటలో బ్రహ్మదేవి, దువ్వూరువారిపాళెం, దమ్మాయపాళెం రైతులు కూడా చాలా మంది ధాన్యం నిల్వ చేసుకున్నారు. మంచి ధర వస్తే అమ్మకాలు చేయాలని నిర్ణయించుకున్నారు.

ధాన్యం కొనుగోలు పూర్తి

మండలంలో వరి కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు కూడా పూర్తయింది. సుమారు 3,200 పుట్ల కొనుగోలు జరిగింది. అయితే, పొట్టెంపాడు, బ్రహ్మదేవి తదితర గ్రామాల రైతులు అమ్మకాలు చేయకుండా నిల్వ చేసుకున్నారు.

– జ్యోత్స్న రాణి, వ్యవసాయాధికారిణి

అప్సా కార్యవర్గ ప్రమాణ స్వీకారం



బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా, నియోజకవర్గ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, మాజీ అధ్యక్షుడు సుందరం హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్సా బ్రోచర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా కర్తం ప్రతాప్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చాట్ల నరసింహరావుతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు.